తుమ్మ ముళ్లు

శ్రీ 'విజయ - రాఘవ'

★

(గతసంచిక తరువాయి)

కళ్లకు పారాణి పాదాలు కనబడినట్లు వుభయ పక్షాలవారికి విస్మయంకలిగింది. ప్రసాదరావు కన్యాదానం చేస్తున్నట్టే మురిసిపోయాడు. "సరే నంటే సరే" ననుకొని పందిట్లో వివాహసమాలోచనం పూర్తి చేసుకొని లేచారు. మరుక్షణంలోనే నరసమ్మ మరణం - అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.

ప్రసాదరావుకి నరసమ్మ మరణానంతరం "జీవితం మీద యిష్టం సన్నగిల్లి పోయింది. "ఎలా బ్రతికితే యేంలేద్దూ" ! అని పెదవులు దొక్కలేదు. సంసారభారంకూడా తమ్ముడైన కుటుంబరావుమీద, చేతికదిగిన కుమారుడు వేణుమీద వదిలాడు. వేణు Bsc; (Agricultural) ప్యాసయి వుద్యోగాలమీద బ్రతుకుభారం వేసి కాలాన్ని వెళ్లబుచ్చాలనే యిచ్ఛలేకుండా, స్వంత వ్యవసాయం, గరువుభూములు హీనదశలో వుంటే, గొట్టాల భావుల్తో నీళ్లు తోడించి సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం ప్రసాదరావు అన్ని శక్తులూ వుడిగిన వ్యక్తిగావున్నాడు. కొత్తావకాయ పెట్టిన రోజుల్లో ఆయన తప్పకుండా ప్రతిబంధువుయింటికి వెళ్లి రుచిచూసి యోగ్యతాపత్రంయిచ్చి పోతూఉండేవాడు. యీ విషయంలో ఆయన అభిప్రాయం అందరూ స్వీకరించాలని కుతూహలపడతారు. యీ మాట నరసమ్మ వుండే రోజుల్లో చాలా రాణింపులోవుండేది. యిప్పుడైనా నెలకు ఒకసారి బంధువర్గాన్ని పలకరించడానికి ప్రయత్నిస్తూనేవుంటాడు. రెండో కూతురు వివాహ విషయంకూడా కుటుంబరావుమీద, వేణు మీద పూర్తిగా వదిలేసినట్లే.

మల్లిఖార్జునరావు ట్రైనింగ్ పూర్తిచేసిన తర్వాత నందిగామువైపు బోర్డుస్కూల్లో వేసారు. అక్కడకు సంసారంతో తరలి వెళ్లాడు. కొంతకాలం గడిచిన తరువాత గన్నవరం తాలూకా దావాజీగూడెంలోకి బదిలీ చేసారు. మల్లిఖార్జునరావుని గురించి యెప్పటి విషయాలు అప్పుడు బ్రహ్మాజీరావు తెలుసుకొంటూనేవున్నాడు. తన మాటంటే లక్ష్యం లేదని, మల్లిఖార్జునరావు గురించి తనబృందానికి చెప్పుకొంటూవుంటాడు. ఇటువంటి పరిస్థితులలో రావమ్మ పెద్దకొడుకు నర్సుని గొల్లపల్లిలో పెద్ద కూతురు అరుంధతి దగ్గర స్కూలుఫైనలు చదివిస్తూ వుంది. స్కూలు ఫైనలుపూర్తిచేసిన తరువాత, కాలేజీలో యెలాచేర్పించాలని రావమ్మ మహా కుతూహల పడింది. హోటల్లోవుంచడానికి భయమేసింది. బెజవాడంతటి మహాపట్టణంలో నర్సుని ఒంటరిగావుంచడానికి రావమ్మ సుతరామూ యిష్టపడలేదు. ఎలాగైనా శోభనాచలపతిని వొప్పించి, బెజవాడ కాలేజీలో చేర్పించి, మాచవరంలో వున్న బ్రహ్మాజీరావు స్థలంలో పాకవేయించి కాపురంవుండాలని ఎత్తుగడవేసింది. యీ యెత్తుగడకు బ్రహ్మాజీరావు కట్టుబడిపోయాడు. బ్రహ్మాజీరావు, మొదట్నుంచి రావమ్మ అంటే చాలా అతీతమైన తెలివి తేటలుగలదనిగదా ! అభిప్రాయం. ఈనాడు రావమ్మ కొడుక్కి తన స్థలంలో పాక వేయించి చదువుచెప్పించుకొంటూ వుంటోందంటానంటే తన మనుమడు, కాలేజీలో స్వయంగా చేరుతున్నాడంటే తనకెంత పేరు వస్తున్నటు. శోభనాచలపతి రావమ్మ ఎత్తుగడకు తటస్థంగా వుండిపోయాడు. బ్రహ్మాజీరావు సరేననటం, శోభనా

చలపతి కాలేజీ సీటుకోసం చద్దన్నం మూట భుజానకట్టి బయలుదేరాడు.

అలివేలమంగ రెండో కొడుకు ఆనాడు తుమ్మ కొమ్మలునరికి దొడ్డిచుట్టూ కంప వేస్తున్నాడు. కంప చాలకపోతే బ్రహ్మాజీరావు స్థలంలోకి పోయి అలివేలమంగ కొట్టమంటేనే రెండుకొమ్మలు నరుక్కొస్తుండగా సత్యవతి చూసింది. వాస్తవికంగా అలివేలమంగ రెండోకొడుక్కీ, సత్యవతికి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. గబగబ యింట్లోంచి పరుగెత్తుకొచ్చి సత్యవతి వాకిట్లో నిలబడి -

“ఎవర్నడిగి కొడుతున్నావురా” – అంది.

“ఎవర్నడగాలేమిటి?” తలబిరుసుగా సమాధానమిచ్చాడు.

“ఎవర్నడగాలేమిటి! నీ యిష్టమొచ్చినట్లు అడక్కుండా కొట్టుకుపోవడమేనా!” అంది సత్యవతి.

“మా అమ్మ కొట్టమంటే కొడుతున్నా! నీ సొమ్మేంపోయింది - పరుగెత్తుకుంటూ వచ్చావ్” అన్నాడు.

“అమ్మ కొట్టమన్నదిట-కొడుకు కొడుతున్నాడు. బుద్ధిలేకుండా యేంమొగంపెట్టుకొని వచ్చి కొడుతున్నావ్. సిగ్గనేది వుండాలి మనిషి జన్మెత్తిన తరువాత” అంటూ సత్యవతి స్వరం పెంచుతోంది.

అలివేలమంగ నెమ్మదిగావచ్చి, – “ఏంమాటలు సత్యం అవి. నేకొట్టమంటేనే కొడుతున్నాడు. వద్దంటే మానేస్తాడుగా - వూరికే నోరు చేసుకొంటావ్ దేనికి? చిన్నా, పెద్దాతారతమ్యత బొత్తిగా పోయినట్లుందే.” అని పెద్దమనిషి తరహాగా అంది.

సత్యవతి మానాభిమానాలు యెప్పుడో మంటలో గలిపిన స్త్రీ కాబట్టి, నోటికి అడ్డు యెలావుంటుంది! వుండవలసిన పనేమిటి?

“చాల్లే జాణలాగా మాట్లాడొచ్చావ్! తగుదునమ్మా! అని సలహాచెప్పడానికొచ్చావ్. అసలు నీకేం హక్కుందని చెట్టుమీద చెయ్యి వేయించావ్. నీ స్థలమా - నీ చెట్టా!”

అలివేలమంగకి తల కొట్టేసినట్లయింది. “చూస్తూ చూస్తూ తోడబుట్టిన చెల్లెలు యెంత మాటకారిలాగా మారిపోయింది! ఎంత ధైర్యంగా మాట్లాడుతోంది. సిగ్గూ – యెగ్గూ లేకుండా యెట్లాబడితే అట్లా బజారుమీదనిలబడి అంటోంది. దీనికిదేం పోయే కాలం ...” అని ఆశ్చర్యం – సిగ్గు – లజ్జ పెనవేసుకొని పోయినయి.

“పోనీ! నాకేం హక్కులేదు నీకుందా” – అంది అలివేలుమంగ.

“ఆ...! యీ స్థలం నాన్న నాకమ్మాడు” ఖచ్చితంగా దిశలు మారు మ్రోగేలాగు గర్జించింది.

అలివేలమంగ నివ్వెర పోయింది. బ్రహ్మాజీరావు యీస్థలం అమ్మాడా! “మానాన్న – నాకమ్మాడంటోంది. “మా నాన్న” అంటే నాకు నాన్న కాడా! యెలా దీనికి అమ్మతాడు. పెంచుకొన్న కొడుకు రామకృష్ణ యెలా వూరుకొన్నాడు! రామకృష్ణ యేమైనా అప్రయోజకుడా స్థలం అమ్ముతుంటే చూస్తూ వూరుకోంటానికి! దీన్లో యెంతనిజం దాగివుంది? అంతకంతకు అలివేలుమంగ కడుపులో యేదో దేవుతున్నట్లుగావుంది. – చివరకు

“పోనీ! ఆ మాట ముందే చెప్పితే ఆగిపోయే వాడుగా. అనవసరంగా నోరు పారవేసుకోవడం దేనికి. నిన్నేమన్నాడని పెట్టిపోషిస్తున్నదానిలాగా అంటున్నావే!” – అని కొడుకును రమ్మని పిలిచింది.

“అడక్కుండా చెట్టుకొడుతుంటే మూగమొద్దులాగా చూస్తూ వూరుకోమంటావా! చక్కగా, బంగారంలాగా యెదుగుతున్నదాన్ని నరకడానికి చేతులెలావచ్చాయి!– నీ చేతులు మాడిపోను. నీకైనా

జ్ఞానముండక్కర్లా!" సత్యవతి ప్రేలాపన అధికమైంది. తిట్లు దొంతర దొంతరగా పేరుకొంటున్నాయి.

"తనుకూడా దాని మాదిరిగా మాట్లాడితే అక్కగారై చేసిన నిర్వాహకమేముంది. అన్నీ తెలిసిన దాన్నికూడా యీ విధంగా మాట్లాడితే లాభం యేమిటి? చిన్నా పెద్ద తారతమ్యం దానికి లేకపోతే నాకుండదా! ఛా! అంటే అందిలే" అని అలివేలు మంగ సారెసారెకు తల్చుకొని, తలవంచుకొని లోపలికి వెళ్లిపోయింది. కొట్టిన రెండుకొమ్మలు యీడ్చుకొంటూ యింటికొచ్చాడు అలివేలు రెండో కొడుకు.

సత్యవతి యింకా కాసేపు అలాగే తిట్టుతూ నిలుచుండిపోయింది.

10

ఒకరోజున బ్రహ్మాజీరావు సత్యవతి యింటికి రావడం జరిగింది. తండ్రిని చూసేటప్పటికి సత్యవతి విషణ్ణవదనంతో కాళ్లు కడుక్కుంటానికి నీళ్లిచ్చింది. కాళ్లుకడుక్కొని, వుత్తరీయంతో మొగం తుడుచుకొంటూ,

"అలావున్నావేమమ్మా" — అన్నాడు.

"యింకాయేముంటుంది. చీటికిమాటికి చివాట్లు తినమని మావారు యిల్లుకట్టారు. నాబ్రతుకంతా తిట్లుతింటూవుంటమేగా. అయిన దానికి, కాని దానికి అలుసుగా దొరికింది నేనొక్కదాన్నేగా! యేమన్నా పడాలి. తప్పుతుందా! మనస్సుకి శాంతి లేకుండా వుందీ కాపురం"

సత్యవతి వాగ్ధారను ఆనకట్ట కట్టలేక పోతున్నాడు బ్రహ్మాజీరావు. "విషయం వూహాకందకుండా వురకలు వేసుకొంటూ పరుగులు తీస్తూంటే తనెలా అడ్డగించాలి" అనేది స్ఫురించడంలా.

"ఏమిటిదంతా నీలో నువ్వేదో యేడుస్తూంటే నాకెట్లా తెలుస్తుంది. అసలు యేం జరిగింది. ఎవరేమైనా అన్నారా?"

"ఎవరో పరాయివాళ్లంటే యింతగా యెందుకేడుస్తా. యీనోటితో మళ్లా అదంతా యేమంటూ చెప్పను?"

"ఆయిన వాళ్లు మాత్రం నిన్నంతగా అంటానికి హక్కేముంది. నీవల్ల తప్పేమైనా వుందా!"

సత్యవతికి యేడుపు పొర్లుకొస్తోంది. బ్రహ్మాజీరావుకి అంతా అయోమయంగా వుంది.

"అసలేం జరిగిందో చెప్పమంటే యెందుకలా కుంగిపోతావ్"

"అక్కయ్య నానామాటలంటే చెల్లెలు పడవలసిన బాధ్యత వుందిగా! అక్కయ్య మాట్లాడిందని చెల్లెలుకూడా మాట్లాడితే యింక అక్కయ్య గౌరవమేముంది?"

"చిన్నక్కయ్య అలామనిషిని అంతతేలిగ్గా చూడదే. అసలు నోరెత్తి అనవసరంగా మాట్లాడే తత్వం దాందికాదే! యెప్పుడూ కూడా అనని మనిషి నిన్నెలా అనగలిగింది — అని వుండదు."

బ్రహ్మాజీరావు బుర్రలో క్రమేపీ ఆలోచనలు వుంగరాలుంగరాలుగా తిరుగుతున్నాయి.

"ఎందుకొచ్చిందీ తగాదా నీకు - దానికి?"

"దాని రెండోకొడుకు వచ్చి మొన్న నీస్థలంలో తుమ్మచెట్టు నరకుతుంటే వీల్లేదన్నాను. ఎందుకు వీలుగాదూ! అని మొరాయించి బలవంతంగా చెట్టుమీద చేయివేయించి కొమ్మలు నరికిస్తుంటే, అదేమిటనన్నా. నీకేంహక్కుంది అడగటానికి అని నానామాటలు కూసింది. నేను మాత్రం యెలా వూరుకొని వుంటాను. నువ్వే చెప్పు నాకుమాత్రం పౌరుషంలేదా! నాకుమాత్రం హక్కులేదా! అది అంటేనే నేనన్నాను" అని సత్యవతి చెప్పడం అయిపోగానే బ్రహ్మాజీరావుకి తల గోక్కోవలసిన పరిస్థితి యేర్పడింది.

"ఛీ"! యేమిటిదంతా అక్కా-చెల్లెళ్లకి పొత్తుకుదరకపోయినప్పుడు యింకొకరితో ఎందుకు కుదరదని అనుకోవడం తెలివి తక్కువగా వుంటుంది. ఒకే రక్తధారకలవాళ్లు, ఒక కడుపున పుట్టినవాళ్లకే యిలా జరిగిందంటే యింకేమిటి? అయినవాళ్లేయిలా తగాదాలు పెంచుకొని, సంబంధ బాంధవ్యాలు తెగ తెంపుకొంటుంటే, పరాయి వాళ్లను వేలెత్తి చూపడం తగనిపని. "తుమ్మచెట్టుదగ్గర అక్కా-చెల్లెళ్లకు అనురాగం అంతమయి, అపకీర్తిపాలయి, అపవాదులకు లోనై, అహర్నిశలు, అంతులేని క్రోధాలు పెంచుకొని యెడబాటు కాటందుకొని వెర్రిబాగులై పోవడం యెంత శోచనీయంగా వుంటుందో ప్రపంచానికి - వీళ్లేమైనా ఆలోచించారా! సత్యవతికి యెంతహక్కుందో, అలివేలు మంగకి కూడా అంతేగా. తనకూతుళ్లందరికి సమానమైన హక్కు వుండనేవుంది. అటువంటప్పుడు యీ తగాదాలేమిటి?" బృహస్పతిలాగా బ్రహ్మాజీరావు ఆలోచించటం మొదలు పెట్టాడు. చివరకు ఓదార్చవలసిన బాధ్యత తనదేగా!-

"ఇక వూరుకో! జరిగిందేదో జరిగిపోయింది" అని వూరడించి ఆనాటికక్కడే భోజనాదులు పూర్తి చేసుకొని యెటోపోయాడు.

11

శోభనాచలపతి సీటుకోసం యేగ్రహబలంలో బయలుదేరాడోగాని చటుక్కున బెజవాడ కాలేజీలో దొరికింది. కాలేజీలాంఛనాలు తీర్చేసి, గొల్లపల్లి బ్రహ్మాజీరావు దగ్గరకు చేరి విషయం అంతా సవిస్తరంగా మనవిచేసాడు. రావమ్మ హంగామా యింతని చెప్పనలవిగాదు. "నర్సు కాలేజిలో చేరుతున్నాడమ్మా" అని వూరంతా చాటింపుకన్నా మిన్నగా చాటించింది. అన్ని నోళ్లు మంచినే మాట్లాడుతాయని అనుకోవడం పొరపాటు. "కాలేజీ, కాలేజీ అంటమేగాని, డబ్బు దండగ తప్ప మరేంలేదు" అని ఒకాయన వూరికే అన్నాడు. "యిది అక్షరాలానూ!" అని ఒకాయన వూరికే అన్నాడు. యిది అక్షరాల యెంతవరకో, కొంతవరకు నిజం అనక తప్పదు.

బ్రహ్మాజీరావు శోభనాచలపతి మంచిరోజున వచ్చిస్థలంకి శంకుస్థాపనచేసారు. ప్రస్తుతానికి అనుకున్నట్లు పాకవేయదలిచారు. కలపంతా శోభనాచలపతిదే పైకప్పుకూడా అతనిదే. యేటొచ్చీ స్థలం బ్రహ్మాజీరావుది.

రావమ్మ నర్సుకి వండిపెట్టడానికి తట్టెడుసంసారం కొండపావురూరులో వదిలిపెట్టి, బెజవాడకు చేరింది. నర్సు కాలేజీకి వెళ్తూ వస్తూన్నాడు. యీ సంగతి జరగడానికి ముందుగానే ఒకసారి బ్రహ్మాజీరావు సుబ్బారావు లేని సమయంలో అలివేలు మంగని చూడటానికి వచ్చి సత్యవతి చెప్పిన తగాదా విషయాన్ని ప్రస్తావించాడు.

అలివేలుమంగ తండ్రిచెప్పిన మాటలన్నీ విని ఆశ్చర్యచకితురాలైంది. చివరకు —

"కల్లబొల్లి మాటలన్ని అలా కల్పించి చెప్పడం నా చేతగాదు... నేనే అన్నానో—అదే అందో భగవంతుడికే తెలును. నువ్వుదానికి స్థలం అమ్మావని అంది. అదీ యెంతవరకు నిజమో నీకే తెలియాలి. మొదట్లోనే యీ స్థలం నువ్వమ్మేనని చెప్పినట్లైతే నేను దానిజోలికెళ్లేదాన్నే గాదు. యీ విషయంలో ఎంతవరకు న్యాయాన్యాయాలున్నాయో యెవరెవరిది తప్పో ఆరోజున తగాదా జరుగుతున్నప్పుడు వున్నట్లయితే, తెలిసేది. విన్నవాళ్లెవరైనా వుంటేనూ, చూచినవాళ్లుంటేను పోయి కనుక్కో ఎవరిది తప్పో. సత్యవతి చెప్పిన మాటల్ని ఆధారంచేసుకొని యీ నాడు నన్నడగటంలో యేంగొప్పవుంది." అని నిష్కర్షగా అలివేలుమంగ అనేసేటప్పటికి బ్రహ్మాజీరావుకి నిశ్చేష్టిత యేర్పడి - యేమంటానికి దారితోచక —

"నువ్వెంతో నాకు, అది కూడా అంతేగా. - దానికి నేనెందుకు స్థలం అమ్మేను! అవసరం వస్తే మీ యిద్దరు ఆస్థలంని వుపయోగించుకోండి అన్నానుగాని — అమ్మేనని అనలేదే." అన్నాడు.

"ఇప్పుడెన్నైనా చెప్పొచ్చు. తప్పంతా నాదే నని నువ్వూ దాంతోపాటు అంటున్నప్పుడు వొప్పుకోక తప్పుతుందా! అయినా నాకెందుకు యింకా నిష్ఫలం. అనుభవిస్తున్న అవమానంచాలు. పోనీ యీనాడది మాట్లాడకపోతే నాకేం జరగందిలేదు. కాకపోతే ఒక తల్లి పిల్లలమని ప్రపంచం అనుకునేటట్లు వుండామనేగాని, వేరేంలేదు." అని, అలివేలు మంగ లేచి వెళ్లిపోయింది. బ్రహ్మాజీరావు నెత్తి మీద గుడ్డ వేసుకొని వచ్చినదారినే తిరుగుముఖం పట్టాడు. భోజనానికి అలివేలు వుండమంటున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు.

12

సరోజిని, మల్లికార్జునరావు దావాజీగూడెంలో కాపురం పెట్టారని చాలామందికి తెలిసింది. బ్రహ్మాజీరావు నెలకు మూడుసార్లైనా వస్తూండే వాడు దావాజీగూడెం. మల్లికార్జునరావుకూడా తోసునుకునేవాడుగాదు. కాని వచ్చినవాడు వచ్చినట్లు వెడితే చాలా సంతోషపడేవాడు. అక్కడ వున్న దుష్టచతుష్టయంతో మల్లికార్జునరావును గురించి దుష్ప్రచారం చేయడం చూస్తే యితరులకే కడుపుమండిపోతూండేది. సరోజిని యింతరాద్ధాంతం చేసినా, మల్లికార్జునరావు తమాయించుకొని చేస్తున్నాడు. దసరాసెలవులు యింకా పదిరోజులకువస్తాయనగా బ్రహ్మాజీరావు వచ్చి విడిదిచేసాడు. ఆ వుండటం సెలవులు రేపటినుంచి మొదలనగా చివరవరకువున్నాడు. సరోజిని తనకుచెప్పకుండా చేస్తున్న అప్పులు మల్లికార్జునరావు బజారుకు వచ్చినప్పుడల్లా తెలుస్తుండేవి — ఆనాడువచ్చిన అప్పుల జాబితా పరికించి, తెల్లబోయి-

"ఎందుకింత ఖర్చయింది" అన్నాడు.

"సంసారం అయినప్పుడు ఖర్చుకాకుండా యేలా వుంటుంది." — అంది సరోజిని.

"చేసేఖర్చు కాస్త ఆలోచించి చేస్తుండాలి."

"నాకలా చేతగాదు. - కావాలంటే మీరే చేసుకోండి. —"

"చెప్పకుండా అప్పులు చేస్తావ్ - యీనాడు యివన్నీ తీర్చవలసినదంటే యెంతకష్టమో నీకేం తెలుస్తుంది"

"ఏమో, యెలాగో నాకేం తెలియదు. అయినా యీ కాపురం నేచేయలేను. ప్రతి దానికి జాగ్రత్తంటే నే వేగలేను."

◆ ◆ ◆

మల్లికార్జునరావు వసారాలోకి వచ్చి కుర్చీలో పడుకున్నాడు. బ్రహ్మాజీరావు, రాగమ్మ—కాంతమ్మ అనే కరటకదమనకులతో పిచ్చాపాటీ వేయబోయాడు. సరోజిని బజారుగుమ్మంలో నిలబడి బ్రహ్మాజీరావుని భోజనానికి రమ్మని కేకలేస్తోంది. మల్లికార్జునరావు ఉగ్రుడయ్యాడు. అతనిలో ఉగ్ర రూపం చూడటం యిదేనాకు మొదటిసారి. గట్టిగా పళ్లుకొరుక్కుంటూ "కందకు లేని దురద కత్తిపీటకెందుకన్నట్లు" "ఆయనకు లేని ఆకలి నీకవుతున్నట్లుందే. ఆకలివేస్తే అన్నంతినాలని ఆయనకు తెలియదూ! గొంతుక చించుకొంటూ బజారునబడి పిల్చకపోతే. యీ మొదనష్టం యెలా విరగడవుతుందో తెలియకుండావుంది." అంటూ లేచి తుండుగుడ్డ బుజాన వేసుకొని బజారున పడ్డాడు.

బ్రహ్మాజీరావుతో మల్లికార్జునరావు భోజనానికి కూర్చోదల్చుకోలేదు. ప్రక్కింటి గంగాధరరావుతో వాకిటరుగు మీద కూర్చుని తెగని సమస్యలను చర్చల్లోకి దించారు. మల్లికార్జునరావు యీరోజున ఆవిధంగా మాట్లాడుతాడని గంగాధరరావు యింతవరకూ వూహించలేదు. గంగాధరరావుకూడా అవివాహితుడైనా అనుభవం గల్గిన వ్యక్తి. "పెళ్ళయిన నేను — పెళ్లికాని నీవు ఒకటేనోయ్" అని మల్లికార్జునరావు అనగానే గంగాధరరావుకి ఆశ్చర్యం వేసింది. మల్లికార్జునరావు యిలాంటిది సందర్భోచితంగా మాట్లాడుతున్నాడంటే వెనుకయేదో లోతు తెలియని లోయ వుంటుందని వూహించేవ్యక్తి.

(సశేషము)